క్లుప్తంగా

మారుమూల గ్రామాలకు వైద్య సేవలు



ఐలవరం(భట్టిప్రోలు): మారుమూల గ్రామాలకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ద్వారా రోగులకు వైద్య సేవలు అందుతున్నాయని ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉదయ భాస్కరి పేర్కొన్నారు. ఐలవరం–1 సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు, అప్తమాలజిస్టులు వైద్య సేవలు అందించారు. రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జునరావు, పార్టీ నాయకులు డి.నాగమల్లేశ్వరరావు, టి.బాలాజి, సచివాలయ, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చుండూరు (భట్టిప్రోలు): చుండూరు, యడ్లపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఏఈ అర్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో శనివారం విద్యుత్ లేన్ల మరమ్మతులు, నిర్వహణలో భాగంగా ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని తెలిపారు.

కొల్లూరు : మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్తు సరఫరాలో శనివారం అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ కె.సుధాకర్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ లైన్ మరమ్మతులు చేపట్టాల్సి ఉండటంతో కొల్లూరు, జువ్వలపాలెం సబ్ స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

ఈ–పంట నమోదు తప్పనిసరి



భట్టిప్రోలు: ప్రభుత్వం ద్వారా పథకాలు అందాలంటే రైతులు ఈ–పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి పేర్కొన్నారు. శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ శాఖాధికారి జీ.మీరయ్య అధ్యక్షతన జరిగింది. ఈకేవైసీ, ఈ–పంట నమోదుకు ఫిబ్రవరి 15 వరకు గడువు ఉందని తెలిపారు. ఏవో మీరయ్య మాట్లాడుతూ ప్రస్తుతం రబీ మినుములో పల్లాకు తెగులు అధికంగా కనబడుతోందన్నారు. ఆర్బీకేల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

రేపల్లె రూరల్: విద్యార్థి దశ నుంచే సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలని సర్పంచ్ గుజ్జర్లమూడి విజయబేబి అన్నారు. ఐఆర్ఈఎఫ్ విద్యా సంస్థలైన ఆర్‌సీ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఉప్పూడి గ్రామంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ప్రిన్సిపల్ జాషువా రెబ్బా, ప్రోగ్రాం ఆఫీసర్ ఏ.వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె రైల్వే స్టేషన్‌లో పిట్‌మెంట్ సౌకర్యం కల్పించాలి

రేపల్లె రూరల్: అమృత్ భారత్ స్టేషన్ కింద అభివృద్ధి చెందుతున్న రేపల్లె రైల్వేస్టేషన్‌లో పిట్‌మెంట్ సౌకర్యం కల్పించాలని పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ యడ్లపల్లి కిషోర్‌బాబు అన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. పిట్‌మెంట్ సౌకర్యం కల్పించటంతో భవిష్యత్‌లో మరిన్ని రైళ్లకు సౌకర్యాలు ఏర్పడే విధంగా ఉంటుందన్నారు. మచిలీపట్నం–రేపల్లె–నిజాంపట్నం–బాపట్ల రైల్వేలైన్ ఏర్పాటుకు గాను పాత గుంటూరు జిల్లా పరిధిలోని పార్లమెంట్ సభ్యులందరూ కలిసి కేంద్ర రైల్వే మంత్రికి విన్నవించి, సాధించాలనికోరారు. అదేవిధంగా గుంటూరు డివిజన్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే సర్వీసులకు లింగంపల్లి టెర్మినల్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా నగదు చెక్కుల పంపిణీ

భట్టిప్రోలు: స్థానిక రథం సెంటర్‌లో శనివారం వైఎస్సార్ ఆసరా నగదు చెక్కుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి గ్రామదర్శిని దోహదం



కోటిపల్లిలోని పాఠశాల తనిఖీలో నీటి పారుదల శాఖ డీఈ దీన దయాళ్



జంపని సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

కొల్లూరు : గ్రామీణ ప్రాంతాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి గ్రామదర్శిని కార్యక్రమం దోహదపడుతుందని నీటి పారుదల శాఖ డీఈ దీన దయాళ్ అన్నారు. శుక్రవారం మండలంలోని దోనేపూడి, పెసర్లంక, అనంతవరం గ్రామాల్లో ప్రత్యేకాధికారులతో కూడిన బృందాలు గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించాయి. డీఈ దీన దయాళ్ దోనేపూడితో పాటు శివారు గ్రామాలైన ఆలపాటి నగరం, కోటిపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, వసతులు పరిశీలించారు. కోటిపల్లి పాఠశాలలో రక్షిత మంచి నీటి పైపునకు కొళాయిలు లేకపోవడాన్ని గమనించి, తక్షణం వాటిని ఏర్పాటు చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. తక్కువమంది పిల్లలున్న అంగన్‌వాడీ కేంద్రాలను శాశ్వత భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో విలీనం చేయాలని సూచించారు. దోనేపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కోటిపల్లి, దోనేపూడి జగనన్న కాలనీల్లో మెరకలు తోలించేందుకు ఉన్నతాధికారుల దృష్టిలో ఉంచుతామని లబ్ధిదారులకు తెలిపారు. మండలంలోని పెసర్లంకలో 10 లంక గ్రామాలకు ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారడంతో రాకపోకలకు సమస్యలు తలెత్తుతున్నాయని అధికారులకు స్థానికులు వివరించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఆయన తెలిపారు.

గ్రామదర్శినితో సమస్యల పరిష్కారం

జంపని(వేమూరు): బాపట్ల జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.విష్ణుమూర్తి జంపని గ్రామంలోని సచివాలయం, ఆరోగ్య ఉప కేంద్రం, పాఠశాలలు, అంగన్ వాడీ, రైతు భరోసా కేంద్రాలను శుక్రవారం సందర్శించారు. గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా ఆయా కార్యాలయాల్లో రికార్డులు పరిశీలించారు. వేమూరు, బలిజేపల్లి, చావలి గ్రామాల్లో స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. చావలి గ్రామంలో జిల్లా జౌళి శాఖ అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి బి.ఉదయ్ కుమార్ పర్యటించారు. బలిజేపల్లిలో మండల వైఎస్సార్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి శోభన్ ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. కార్యాలయాల సిబ్బంది పని తీరుపై కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జంపని, బలిజేపల్లి, చావలి పంచాయతీ కార్యదర్శులు వివేక్, సింధూ, గాజుల శ్రీనివాసరరావు పాల్గొన్నారు.

అమర్తలూరులో గ్రామదర్శిని

అమర్తలూరు(వేమూరు): గ్రామీణ సమస్యలు తెలుసుకునేందుకు గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ వి.అరుణకుమారి అన్నారు. అమర్తలూరు మండలంలోని అమర్తలూరు, యలవర్రు గ్రామాల్లో గ్రామదర్శిని శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. సంబంధిత అధికారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి

బూత్ కన్వీనర్లకు ఎమ్మెల్యే రఘుపతి దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి

పిట్టలవానిపాలెం: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పిలుపునిచ్చారు. ఖాజీపాలెం కల్యాణ మండపంలో శుక్రవారం బూత్ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు ఏ సమయంలో సిద్ధంగా ఉండాలని అన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు మళ్లీ ఆయనను ముఖ్యమంత్రిని చేస్తాయని పేర్కొన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకోబోతున్నామని ఉత్సాహపరిచారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ షేక్ బాజి, వైస్ ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, కృపానందం, నాయకులు మండే విజయ్‌కుమార్, అహ్మద్ హుస్సేన్, కూసంపూడి దేవేంద్రరాజు, బాపట్ల జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు యేట్ర అశ్వినిరెడ్డి, మునీర్, బొలగాని సుబ్బారావు, మంతెన గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి 'వైఎస్సార్ ఆసరా' భరోసా

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



వైఎస్సార్ ఆసరా నమూన నగదు చెక్కు అందజేస్తున్న సమన్వయకర్త అశోక్‌బాబు

అమర్తలూరు(వేమూరు): మహిళల జీవనోపాధికి 'వైఎస్సార్ ఆసరా' భరోసా కల్పిస్తుందని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని కో–ఆపరేటివ్ బ్యాంక్ వద్ద వైఎస్సార్ ఆసరా నాలుగవ విడత నగదు చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభి షేకం చేశారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాలకు రుణ మాఫీ చేస్తామని చంద్రబాబునాయుడు ప్రకటించి, తీరని మోసం చేశారని గుర్తుచేశారు. డ్వాక్రా సంఘాల గురించి కనీసం పట్టించు కోలేదన్నారు. దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలోని 969 పొదుపు గ్రూపుల ఖాతాలకు రూ.8.30కోట్లు జమ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఎంపీపీ రాపర్ల నరేంద్ర, జెడ్పీటీసీ మూల్పూరు లావణ్య, సర్పంచ్ దేవరకొండ రాము, గొల్లపూడి లక్ష్మి, పార్టీ మండలాధ్యక్షుడు యలవర్తి సురేష్, బొట్టు మోషే, షేక్ హుస్సేన్, కూచిపూడి శ్రీనివాసరరావు, సర్పంచ్‌లు కొండమూది శ్యామల, ఎం.జీవమణి, మండల క్రాంతి పథం సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్

నగరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ పేర్కొన్నారు. పెదమట్లపూడి పంచాయతీ పరిధిలోని ఉక్కావారిపాలెంలో శుక్రవారం డాక్టర్ ఈవూరు గణేష్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా నవరత్నాలు ప్రవేశపెట్టి, సమర్థంగా అమలు చేశారని కొనియాడారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో సంక్షేమ పథకాలు ఎలాంటి అవినీతికి తావులేకుండా ప్రజల ఇంటి ముంగిటకు అందిస్తున్నట్లు చెప్పారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా ప్రాధాన్యతనిచ్చి రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి కృషిచేశారన్నారు. గ్రామాల్లో ఎక్కడ పర్యటించినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని.. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజలు చెబుతున్నారని ఈవూరి తెలిపారు. ఎన్ని పార్టీలు ఏకమైనా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా గ్రామంలోని 40 కుటుంబాలూ వైఎస్సార్ సీపీలో చేరాయి. సమన్వయకర్త డాక్టర్ గణేష్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉక్కా వెంకటేశ్వరరావు(బాపయ్య), మాజీ ఎంపీపీ తాతా పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నేతలు..

నిజాంపట్నం: మండలంలోని బొర్రావారిపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ శుక్రవారం పార్టీ కండువా కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పార్టీలో చేరి వారు తెలిపారు. బొర్రా గోపాలరావు, బొర్రా బాబురావు , బొర్రా వెంకటేశ్వరరావు, కాటూరి సుబ్బయ్య, మునిశ్వరరావు, కర్ర విజయ్ కుమార్, కల్లిఫలం గ్రామానికి చెందిన పరిశ వరప్రసాద్, పరిశ అర్జున్ రావుతో పాటు పలువురు పార్టీలో చేరారు.

ఘనంగా అమావాస్య హోమం



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలోని శ్రీ బగళాముఖి దేవాలయంలో శుక్రవారం రాత్రి 60వ దివ్య అమావాస్య హోమం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మేనమామ, కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రరెడ్డి కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ అధికారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో వేద పండితుల ఆశీర్వచనాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని కోరుకున్నానని ఆయన తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఈఓ నరసింహమూర్తి రవీంద్రరెడ్డి దంపతులను నూతన వస్త్రాలతో సత్కరించారు. పెందుర్తి శివరామప్రసాద్, సాయి కార్తీక్, సాయి స్వప్న ఉన్నారు.

రేపు ఆలమ్ని హౌస్ ప్రారంభోత్సవం

అసోసియేట్ డీన్ డాక్టర్ వి. శ్రీనివాసరావు

బాపట్ల: స్థానిక వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థుల ఆర్థిక సహకారంతో నిర్మించిన ఆలమ్ని హౌస్ ఆదివారం ప్రారంభించనున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి. శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య డాక్టర్ ఆర్. శారదాజయలక్ష్మి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. మాజీ ఉప కులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి, వర్సిటీ అధికారులు, శాస్త్రవేత్తలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. అగ్రికల్చరల్ గ్రాడ్యుయేట్స్ ట్రస్ట్ ఫర్ కాలేజ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్మించిన ఆలమ్ని హౌస్ పూర్వ విద్యార్థుల విశ్రాంతి గృహంగా వినియోగించబడుతుందని తెలిపారు. పూర్వ విద్యార్థి, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు విరాళాలు ఇచ్చినట్లు తెలిపారు. పూర్వ విద్యార్థి, బెంగళూరుకు చెందిన మేవా గ్రూప్ ఎండీ వి.హరి ప్రసాద్ ద్వారా వ్యవసాయ సాంకేతిక సమాచార కేంద్రం నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. కళాశాల పూర్వ విద్యార్థులు రైతులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

మహిళాభ్యున్నతికి వైఎస్సార్ చేయూత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నేతాజీ

కర్లపాలెం: మహిళాభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్ వైఎస్సార్ చేయూత పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని ఎంపీడీఓ కె.నేతాజీ అన్నారు. వైఎస్సార్ చేయూత నాల్గవ విడత నిధుల విడుదలపై డ్వాక్రా వీవోఏలకు, సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాల్లోని 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న అక్క చెల్లెమ్మలకు ఆర్థికంగా తోడ్పాటునందించేందుకు వైఎస్సార్ చేయూత పథకం అమలు చేస్తున్నారని చెప్పారు. ఏపీఎం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత పథకం ద్వారా అర్హులైన మహిళలకు నాలుగు విడతలుగా రూ.75వేలు వస్తున్నాయని వీటిని జీవనోపాధి కల్పించుకునేందుకు వినియోగించుకోవాలని చెప్పారు. డ్వాక్రా మహిళలు ఇటీవల బదిలీపై వచ్చిన ఎంపీడీవో నేతాజీని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సీసీలు పూర్ణచంద్రరావు, శివకోటేశ్వరి, వీవోఏలు, సచివాలయం వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఆర్డీవో హెలా షారోన్



ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ హెలా షారోన్

రేపల్లె రూరల్: ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం సిబ్బంది నిత్యం తమ కార్యాలయ పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆర్డీఓ హెలా షారోన్ ఆదేశించారు. సచివాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల, ఆరోగ్య కేంద్రాల తనిఖీలో భాగంగా బేతపూడి పంచాయతీలోని ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె సందర్శించారు. సమస్యలపై వచ్చే ప్రజలకు ఆరోగ్య సిబ్బంది సహనంతో కూడిన సేవలు అందించాలని సూచించారు. తమ పరిధిలోని ప్రజల ఆరోగ్య వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలన్నారు. విధుల వివరాలను రికార్డు చేయాలని చెప్పారు. ఉప కేంద్రంలో అందుబాటులో ఉన్న, కొత్తగా వచ్చే మందుల వివరాలు, రోగులకు అందించే వాటిని విధిగా నమోదు చేయాలని చెప్పారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలను ఆర్డీఓ తనిఖీ చేశారు. వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్యాంశాల్లోని వివిధ ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రఘుపతి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: ప్రతి ఇంటా సంక్షేమం లక్ష్యంగా సీఎం జగనన్న రాష్ట్రంలో పాలన చేపట్టారని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. కోన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుదీర్‌బాబు, నాయకులు చేజర్ల నారాయణరెడ్డి, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, అంకమ్మరావు, న్యాయవాది రవికుమార్, మలబంటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి ప్రత్యేక చర్యలు



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ రామచంద్రారెడ్డి

బాపట్ల: పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా పట్టణంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలో పలు కాలనీల్లో పారిశుద్ధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. శానిటరీ విభాగ సిబ్బందికి.. పలు సూచనలు చేశారు. సచివాలయాల వారీగా ప్రత్యేక పారిశుద్ధ్య పనుల చేపట్టాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు డీఈ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నజీర్ శ్రీనివాసరావు ఉన్నారు.

దుప్పట్లు పంపిణీ



కర్లపాలెం: పేదలకు చేయూతనందించటం అభినందనీయమని పాస్టర్ శ్యామ్యూల్ అన్నారు. పేరలి గ్రామానికి చెందిన వీరాస్వామి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గొర్రుముచ్చు వందనం ఇటీవల డాక్టరేట్ అందుకున్నందున సంఘ పెద్దలు శుక్రవారం రాత్రి ఆయనను సన్మానించారు. గ్రామంలోని 40 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేసి, అన్నదానం చేశారు. వీరాస్వామి ఫౌండేషన్ సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా వందనంకు డాక్టరేట్ రావటం అభినందనీయమన్నారు. ప్రముఖ రంగస్థల కళాకారిణి పుష్పలత ఫౌండేషన్‌కు రూ.10వేలు విరాళం అందజేశారు. పాస్టర్లు జె.ప్రసంగి, డి.ఏసోబు, వీరయ్య, అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

అల్బెండజోల్ మాత్రలు పంపిణీ



నిజాంపట్నం: నులిపురుగులు నివారణకు అల్బెండజోల్ మాత్రలను హెల్త్ సూపర్ వైజర్ మురళీ దిండి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పంపిణీ చేశారు. నులిపురుగులతో రోగ నిరోధక శక్తి తగ్గంతో పాటు అనారోగ్య సమస్యల బారిన పడాల్సిన పరిస్థితులు నెలకొంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

అమర్తలూరు(వేమూరు): మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అమర్తలూరు మండలంలోని యలవర్రు గ్రామానికి చెందిన దాసరి అబ్రహాం మద్యం విక్రయిస్తున్న క్రమంలో ఎస్ఐ నవీన్ కుమార్ దాడులు నిర్వహించి అతనిని అదుపులో తీసుకున్నారు. అతని నుంచి పది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

41 మద్యం సీసాలు స్వాధీనం



కర్లపాలెం: మండలంలోని పెదపులుగువారిపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నంగు సముద్రాలరెడ్డిని ఎస్ఐ పి.జనార్దన్ తన సిబ్బందితో శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఇంటిలో నిల్వ ఉంచిన 41మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



కర్లపాలెం: రబీ సాగులో సస్యరక్షణ చేపట్టాలని బాపట్ల ఏడీఏ ఎ.లక్ష్మి తెలిపారు. నల్లమోతువారిపాలెం రైతు భరోసా కేంద్రంలో జాతీయ ఆహార భద్రతా మిషన్ కార్యక్రమంలో భాగంగా సస్యరక్షణ పద్ధతులపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ లక్ష్మి మాట్లాడుతూ రబీ పంటలు మినుము, పెసర, మిర్చి పైర్లకు ఆశించే తెగుళ్ల నివారణకు అవసరం మేరకే పురుగు మందులు పిచికారీ చేయాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించి, తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంటలు పండించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుమంత్‌కుమార్, వ్యవసాయ సహాయకురాలు నవ్యశ్రీ, రైతులు తదితరులు ఉన్నారు.

15 లోపు పంట నమోదు చేయించాలి

కర్లపాలెం: రబీ సీజన్‌లో సాగు చేపట్టిన రైతులందరూ ఈ నెల 15వ తేదీ లోపు ఈ–క్రాప్‌లో పంటలు నమోదు చేయించుకోవాలని ఏడీఏ లక్ష్మి తెలిపారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. పంటల ఈకేవైసీ చేయించుకోవాలని ఏడీఏ సూచించారు. మొత్తం 9,986 ఎకరాల్లో సాగు చేయగా ప్రస్తుతం 85శాతం మేరకే పంట నమోదు జరిగిందని 32శాతం మాత్రమే ఈకేవైసీ పూర్తయిందని ఆమె చెప్పారు. పంటలు సాగు చేసిన రైతులందరూ గ్రామ వ్యవసాయ సహాయకులను వెంటనే సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో సుమంత్ కుమార్, పశు వైద్యులు రేచల్ దివ్య, వ్యవసాయాధికారులు సలహా మండలి సభ్యులు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

12న ఘంటసాల మాసోత్సవాలు

బాపట్ల అర్బన్ : ఘంటసాల వర్ధంతి మాసోత్సవాల్లో భాగంగా ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 12న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సినీ గేయ పోటీలు నిర్వహించనున్నట్లు వేదిక జాతీయ అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. వెదుళ్ళపల్లి చైతన్య భవన్‌లో శుక్రవారం కమిటీ సమావేశం నిర్వహించారు. మాసోత్సవాల సందర్భంగా విజయవాడ, గుంటూరు, చీరాల, బాపట్ల, తదితర ప్రాంతాల్లో ఘంటసాల విగ్రహాల వద్ద నివాళులర్పించడం జరుగుతుందన్నారు.